క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు: ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో పలు విభాగాల్లో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కళాశాలలో 15మంది ప్రొఫెసర్లు, తొమ్మిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 55మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 19మంది సీనియర్ రెసిడెంట్ల పోస్టులు ఖాళీ ఉన్నాయని వివరించారు. అర్హులు జూలై 1వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి రూం నంబర్ 48లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

'ఆదివాసీలకు అన్యాయం'

ములుగు: రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా గిరిజనులకు విద్యా, ఉపాధి రంగాల్లో 10శాతం రిజర్వేషన్ కల్పించడానికి ముందుకు వచ్చిందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కి బడ్జెట్ కేటాయింపులో తూతూ మంత్రంగా కేవలం 6 శాతం మందిని మాత్రమే పరిగణలోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

పరామర్శ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన అబ్బు వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దంగుల మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ అలేటి ఇంద్రాసేనారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబయ్య, మండల ఉపాధ్యక్షుడు చల్లా రజినికర్‌రెడ్డి, నాయకులు చింతల కొమురయ్య, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: జిల్లాలో ఉద్యాన పంటలైనా కూరగాయలు, ఆయిల్ పామ్, మిర్చి, పండ్ల తోటలు సాగుచేస్తున్న రైతులు పంటల వివరాలను సర్వేనంబర్ వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించి నమోదు చేయించుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమోదైన వివరాల ఆధారంగా రైతులకు భవిష్యత్‌లో ఉద్యాన శాఖ ద్వారా అందించే వివిధ పథకాలు, రాయితీలు నిర్ణయించడానికి అవకాశం ఉంటుందన్నారు. అకాల వర్షాల ద్వారా జరిగే పంట నష్టం, నష్ట పరిహారం అందించేందుకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

డేంజర్ జోన్ ఇళ్ల వివరాలు సేకరించాలి

మల్హర్: ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలోని మండలంలోని పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లో ఉన్న ఇళ్ల వివరాలు సేకరించాలని తాడిచర్ల భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలో తాడిచర్ల గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిర్వాసితులు మాట్లాడారు. ఫిబ్రవరి 25న ధర్నా చేసిన క్రమంలో నాలుగు నెలల్లో డేంజన్ జోన్ సమస్య పరిష్కరిస్తామని జెన్‌కో సీఈ సిద్ధయ్య హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఆరు నెలలు అవుతున్నా ఇళ్లు తీసుకోవడానికి జెన్‌కో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓపెన్‌కాస్ట్‌లతో ఇళ్లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం ప్రధాన కార్యదర్శి అక్కపాక సమ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేష్ పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్య మిత్రలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు డీపీవో కేడర్ కలిపిస్తూ ఉద్యోగ భద్రత, జీతాలను పెంచాలని కోరారు. ఆరోగ్య మిత్రలకు ఈ కేడర్ కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి జీతాలు పెంచి వారి కుటుంబాలు వీధిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమస్యలు పరిష్కరించుకోవడానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

కళాకారుల ప్రదర్శన



కాటారం: భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, మత్తు పానియాలు, మాదక ద్రవ్యాల నివారణపై సారథి కళాకారులు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కళా ప్రదర్శన ఇచ్చారు. తమ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మూడు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని.. కుటుంబ పోషణ భారంగా మారిందని కళాకారులు ఆవేదన వ్యక్తంచేశారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ



ఏటూరునాగారం: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుమలత

ఏటూరునాగారం: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని రొయ్యూర్ వైద్యాధికారి సుమలత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో రొయ్యూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 29 మంది విద్యార్థులను పరీక్షించి ఇద్దరికి జ్వరాలు రావడంతో రక్తనమూనాలను సేకరించారు. వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యమ్మ, ఆశకార్యకర్త స్వరూప పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని సుడిబాక, ఉప్పేడు వీరాపురం గ్రామాల్లో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు స్నేహ, అశీష సోహేల్, సిబ్బంది జ్యోతి తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన చెట్టు



చెట్టు పడడంతో మృతి చెందిన జహంగీర్

- ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిపై పడిన చెట్టు
- అక్కడికక్కడే మృతి



జహంగీర్(ఫైల్)

ఏటూరునాగారం: రోడ్డుపై ప్రయాణిస్తున్న యువకుడిని చెట్టు రూపంలో వచ్చిన మృత్యువు కబలించింది. చిన్నబోయినపల్లికి చెందిన ఎస్‌కే. జహంగీర్ (32)పై చెట్టు విరిగి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిన్నబోయినపల్లిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని చిన్నబోయినపల్లికి చెందిన ఎస్‌కే. సయ్యద్ మహాబాబీకి ముగ్గురు సంతానం. పెద్దవాడు అయినా జంగీర్ ఆరు నెలల క్రితం చిన్నబోయినపల్లిలో ఎస్ఎంఎస్ మెడికల్ షాపును నూతనంగా ఏర్పాటు చేసుకున్నారు. ఇదేక్రమంలో ఏటూరునాగారం కోరియర్‌లో మందులు రావడంతో అవి తీసుకువచ్చేందుకు బైక్‌పై ఇంటి నుంచి వెళ్తుండగా ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి గ్రామాల మధ్యలోని 163 జాతీయ రహదారి పోతరాజు బోరు వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెట్టు వర్షాల కారణంగా వేరుకుల్లిపోయి విరిగి పడడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. తన కొడుకు వార్త విన్న తల్లిదండ్రులు బోరున విలపించారు. కొడుకుకు ఏప్రిల్ నెలలో వివాహం నిశ్చయించుకొని పూలుపండ్లు కూడా చేసుకొని సెప్టెంబర్ మాసంలో వివాహం జరిపిద్దామని అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివాహం జరగకుండానే అల్లా నా కొడుకును తీసుకపోయాడని తల్లిదండ్రులు వాపోయారు. ఈ ప్రమాద ఘటనను తెలుసుకున్న ఎస్సై తాజొద్దీన్ తన సిబ్బందితో వచ్చి వెంటనే మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చెట్టుపై పడిన వాటిని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. చురుకైన యువకుడు మృతి చెందడంతో చిన్నబోయినపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే రోడ్డు వెంట వేర్లు కుల్లిపోయి ప్రమాదబరితంగా ఉన్న చెట్లను అటవీశాఖ అధికారులు తొలగించేందకు అడ్డుపడుతున్నారని చిన్నబోయినపల్లి ప్రజలు మండిపడుతున్నారు. జంగీర్ మృతికి అటవీశాఖ అధికారులే కారణమని మండిపడుతున్నారు.



మృతదేహాన్ని తీస్తూ ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న ఎస్సై తాజొద్దీన్

సాగు చట్టాలపై అవగాహన తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మహేందర్

ములుగు రూరల్: రైతులు సాగు చట్టాలపై తప్పనిసరిగి అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. మండల పరిధిలోని అబ్బాపూర్‌లో రైతులతో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు కొనుగోలు చేసే విత్తనాలు, మందులు నాణ్యత లేని క్రమంలో చట్టాలను అనుసరించి కంపెనీలపై కేసులు నమోదు చేయాలన్నారు. పంటల బీమా అందని క్రమంలో చట్టాలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఉచిత న్యాయం, తదితర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్వామిదాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'గిరిజనుల అభివృద్ధిని మరిచిన ప్రభుత్వం'

వెంకటాపురం(కె): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో గిరిజనుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీని మోదీ ప్రభుత్వం అదోగతి పాలు చేసిందని ఆరోపించారు. గిరిజనుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు అంకెల గారడి చేసి నమ్మించే ప్రయత్నం చేసిందని అన్నారు. ఎన్నికల ముందు గిరిజన యూనివర్సిటీపై ఇచ్చిన హామీని అమలు చేయటం లేదని అన్నారు.

జహంగీర్ కుటుంబాన్ని ఆదుకుంటాం..

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లికి చెందిన ఎస్.కె జహంగీర్ కుటుంబాన్ని ఆదుకుంటామని మెడికల్‌షాపుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్‌ఖాన్ అన్నారు. గురువారం చిన్నబోయినపల్లికి చెందిన జహంగీర్ చెట్టు విరిగి పడి మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పావని, షాపుల యజమానులు సత్యదేవ, బచ్చు పూర్ణచందర్‌రావు, మజీబ్, రంజార్ తదితరులు ఉన్నారు.

సామాజిక ఆస్పత్రికి సామగ్రి అందజేత



ఎయిర్‌బెడ్‌ను అందజేస్తున్న దాతలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి గ్రామానికి చెందిన నాగుల రవీందర్ జ్ఞాపకార్థం ఆమె భార్య చంద్రకళ, వారి కుటుంబ సభ్యులు సింధు దిలీప్, అనూష సాయికిరణ్‌లు గురువారం సామగ్రి అందజేశారు. రూ.30వేలు విలువ చేసే ఎయిర్‌బెడ్, సక్షన్ మిషన్, వీల్‌చైర్‌లను సామాజిక ఆస్పత్రికి రోగుల అవసరాల నిమిత్తం ఉచితంగా పంపిణీ చేశారు. సామగ్రిని అందజేసినందుకు వారి కుటుంబ సభ్యులకు ఆస్పత్రికి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, వైద్యులు రాకేష్, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక ఆస్పత్రికి ఇలాంటి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింగరావు, అలువాల శ్రీనివాస్, ఇర్సవడ్ల సంతోష్, నాగుల రమేష్, మాచర్ల నరేందర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

వాజేడు: మండల కేంద్రంలో దోమల నివారణకు గురువారం సాయంత్రం ఫాగింగ్ పనులను చేపట్టారు. ప్రతీ వీధిలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. గత వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో దోమల ఉధృతి పెరిగింది. దోమల నివారణలో భాగంగా ఫాగింగ్ చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదకరంగా ఎండిన చెట్టు

ఏటూరునాగారం: చిన్నబోయినపల్లి అటవీశాఖ కార్యాలయం వద్ద 163 జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టు పూర్తిగా ఎండిపోయి ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా కనబడుతుంది. అయినప్పటికీ అటవీశాఖ అధికారులు ఆ చెట్టును తొలగించేందుకు వెనుకాముందు ఆడుతున్నారు. రోడ్డు వెంట ప్రయాణించే ప్రయాణికులు, వాహనాలపై చెట్లు విరిగి పడుతున్నా అటవీశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. గురువారం చెట్టు విరిగి పడి చిన్నబోయినపల్లిలో నిండు ప్రాణం పోయినప్పటికీ ఈ ఎండిన చెట్టును సైతం తొలగించడం లేదు.



ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్టు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

చిన్నబోయినపల్లి సమీపంలో ఉన్న ఎండిపోయి నా చెట్టును అటవీశాఖ అధికారులు తొలగించడం లేదు. ఒక పక్క ప్రాణాలు పోతున్నప్పటికీ అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. జహంగీర్‌పై ఒక చెట్టు విరిగి పడి మృతి చెందినప్పటికీ ఈ చెట్టును మాత్రం తొలగించేందుకు అటవీశాఖ, 163 రహదారి అధికారులు ముందుకు రాకపోవడం బాధాకరం

– తుమ్మ సంజీవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ

'ఆదాయానికి, కేటాయింపులకు పొంతన లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆదాయం, ఖర్చుకు పొంతన లేకుండా కేటాయింపులకు జరిగాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో 33రకాల పంటలకు బోనస్‌లు ఇస్తామని ప్రకటించారు గానీ రైతులు సాగు చేస్తున్న దొడ్డు వడ్లకు బోనస్ ఉంటుందా లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు బడ్జెట్ కేటాయించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో అంకెల గారడి చేసిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. నాయకులు గాదం కుమార్, కొత్త సురేందర్, రవీంద్రాచారి, కృష్ణాకర్, నాగరాజు, రవిరెడ్డి పాల్గొన్నారు.

న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(కె): భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం అవరణలో పూనెం ప్రతాప్ అధ్యక్షతన గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ న్యాయ కళాశాల కోసం అసెంబ్లీలో ఆదివాసీ ఎమ్మెల్యేలు మాట్లాడాలని అన్నారు. రాష్ట్రాల విభజన వల్ల ఆదివాసీలకు అన్యాయం జరిగిందని అన్నారు. ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఆదివాసీ యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సింగరేణి అధికారుల ఆధిపత్య ధోరణి



సమావేశంలో మాట్లాడుతున్న గట్టయ్య

భూపాలపల్లి అర్బన్: సింగరేణి వ్యాప్తంగా కార్మికులపై యాజమాన్యం ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తుందని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గట్టయ్య మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు కార్మిక సంఘాలకు గుర్తింపు పత్రం రాకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. గెలుపొందిన సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. సంఘ నాయకులు వారి వ్యక్తిగత పనులు మాత్రం యధావిధిగా చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిని ఆసరాగా చేసుకొని సింగరేణి వ్యాప్తంగా అధికారులు కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల విషయంలో గని స్థాయి అధికారులకు చెప్పుకుందామంటే వారు స్పందించడం లేదన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, సంస్థ అభివృద్ధి కోసం సింగరేణి సీఎండీ అన్ని కార్మిక సంఘాల నాయకుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నప్పటికీ ఏరియాలో జీఎం మాత్రం సంఘ నాయకుల అభిప్రాయాలను తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాంటి అధికారులపైన సింగరేణి డైరెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కుమారస్వామి, రాజయ్య, జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, లింగన్న, శ్రీధర్, శ్రీనివాస్, జయశంకర్, విజయ్, సాదిక్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): ఆటోలోని బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు



వాజేడు: కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీ సమీపంలో కొత్తపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై తిరుపతి రావు అధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలను చేశారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలను ముమ్మరం చేశారు. వెంకటాపురం మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీచేసి అనుమానిత వ్యక్తులు తారస పడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు వద్ద 163 నంబర్ జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మావోయిస్టుల వారోత్సవాల్లో భాగంగా ఈ తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వాహనాల్లోని బ్యాగులను సోదాలు చేయడంతో పాటు ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ఏటూరునాగారం సెకండ్ ఎస్సై రమేష్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ నెల 28నుంచి ఆగస్టు 2వరకు మావోయిస్టుల వారోత్సవాలు ఉండడంతో గురువారం మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు అప్రమత్తమై ముందస్తుగా వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానితుల వివరాలను సేకరించారు. వాహనాలకు ధ్రువపత్రాలు, లైసెన్సులు పరిశీలించారు. ఛత్తీస్‌గఢ్ వైపునకు వెళ్లే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఏటూరునాగారం: తనిఖీ చేస్తున్న ఎస్సై రమేశ్

బురదమయంగా రహదారి



బురదమయంగా ఉన్న రహదారి

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో రహదారి చిత్తడి చిత్తడిగా మారింది. రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చడం కోసం మట్టి పోశారు. వాజేడు భద్రాచలం ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. వర్షాలు పడుతుండటంతో ఆ మట్టి బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.